సాక్షి
పశ్చిమగోదావరి

శనివారం ၊ 26 ၊ అక్టోబర్ ၊ 2024



ఇసుక అక్రమ రవాణా

మునునూరు మండలంలో మట్టి అక్రమ రవాణాతో జేబులు నింపుకున్న టీడీపీ నేతలు ఇప్పుడు ఇసుక అక్రమాలు ప్రారంభించారు.

10లో ▸



సెల్‌ఫోన్ల రికవరీ

ఏలూరు జిల్లాలో చోరీకి గురైన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. 154 ఫోన్లను వాటి యజమానులకు అందజేశారు.

10లో ▸



అమ్మితే లాస్.. కొంటే షాక్

నిమ్మ పండించే రైతులకు గిట్టుబాటు ధర రాదు.. మార్కెట్‌లో నిమ్మ సామాన్యులకు అందుబాటులో ఉండటం లేదు.

10లో ▸

న్యూస్‌రీల్

టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్



మెటీరియల్ విడుదలచేస్తున్న డీఈఓ నాగమణి

భీమవరం: ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల కోసం తయారుచేసిన గణిత దీప్తి స్టడీ మెటీరియల్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి విడుదల చేశారు. శుక్రవారం స్థానిక డీఈఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను వినియోగించుకుని అధిక శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్స్ కె.సంధ్య, ఎస్.సత్యనారాయణ, సూపరింటెండెంట్ తిరుపతిరాజు, ఏపీఎంఎఫ్ స్టేట్ సెక్రటరీ జి.శ్రీనివాస వర్మ, చెకుముకి జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్నబాబు, మల్లుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెలుగు యానిమేటర్ల బకాయి జీతాలు చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మలాదేవి

భీమవరం: వెలుగు యానిమేటర్ల బకాయి జీతాలు వెంటనే విడుదల చేయాలని, రాజకీయ వేధింపుల పేరుతో అక్రమ తొలగింపులను నిలిపివేయాలని ఏపీ వెలుగు యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం భీమవరం సీఐటీయూ కార్యాలయంలో యూనియన్ జిల్లా విస్తృత సమావేశంలో వీఓఏల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎ.నిర్మలాదేవి మాట్లాడారు. యానిమేటర్లకు ఆరు నెలలుగా జీతాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొన్ని మండలాల్లో వీఓఏలను తొలగించేందుకు అధికార పార్టీ నాయకుల వేధింపులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ ఉదయం 9 గంటలకు వచ్చి సంతకాలు పెట్టాలని ఒత్తిడి చేయడం సరైంది కాదన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాయ్ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా స్కీం ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. గోవిందమ్మ, లక్ష్మీకుమారి, పద్మావతి, దుర్గ, లక్ష్మి పాల్గొన్నారు.

సస్యరక్షణపై శిక్షణ అవసరం



అధికారులకు సర్టిఫికెట్లు అందిస్తున్న దృశ్యం

పెనుమంట్ర: సస్యరక్షణపై గ్రామస్థాయి అధికారులతో పాటు జిల్లాస్థాయి అధికారులకు శిక్షణ ఇవ్వడం అవసరమని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంతీయ డైరెక్టర్ పీవీ సత్యనారాయణ అన్నారు. మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానంలో ఐదు రోజుల పాటు జరిగిన సస్యరక్షణ శిక్షణ శుక్రవారం ముగిసింది. ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్రం జేడీ ఎ.సిద్దిఖి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. పరిశోధనా స్థానం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ టి.శ్రీనివాస్, కేంద్రియ సమగ్ర సస్యరక్షణ కేంద్రం సిబ్బంది మనోజ్‌పూరి, గోస్వామి, పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త ఎంపీ కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

నేడు త్రిపుర గవర్నర్ రాక

భీమవరం (ప్రకాశంచౌక్): త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనరెడ్డి శనివారం భీమవరంలో పర్యటించనున్నట్టు జిల్లా సమాచార శాఖ ప్రకటనలో తెలిపింది. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నారాయణపురంలో కార్యక్రమం అనంతరం సాయంత్రం 6.30 గంటలకు భీమవరం పర్యాటక శాఖ అతిథి గృహానికి చేరుకుంటారు. రాత్రి 7 గంటలకు అక్కడే సమావేశానికి హాజరవుతారు. రాత్రి 8.30 గంటలకు స్థానికంగా విందుకు హాజరై 9.30 గంటలకు టూరిజం గెస్ట్ హౌస్‌కు చేరుకుని రాత్రి బస చేస్తారు. 27వ తేదీ పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఎస్ఎస్‌సీ ఫీజులు చెల్లించండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వచ్చే ఏడాదిలో జరిగే ఎస్ఎస్‌సీ, ఓఎస్ఎస్‌సీ, ఒకేషనల్ పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ఫీజు చెల్లింపు తేదీలను ప్రకటించినట్టు ఏలూరు డీఈఓ ఎస్.అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 28 నుంచి వచ్చేనెల 11 వరకు అపరాధ రుసుం లేకుండా, నవంబర్ 12 నుంచి 18 వరకు రూ.50 అపరాధ రుసుంతో, నవంబర్ 19 నుంచి 25 వరకు రూ.200 ఫైన్‌తో, నవంబర్ 26 నుంచి 30 వరకు రూ.500 అపరాధ రుసుంతో ఫీజులు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

ప్రజల పక్షాన పోరాడతాం

- సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేస్తాం
- కార్యకర్తలకు అండగా.. ప్రజలకు వెన్నంటి ఉంటాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు



వైఎస్సార్‌సీపీ జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు. పాల్గొన్న మాజీ మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు, నియోజకవర్గ ఇన్‌చార్జులు గూడూరి ఉమాబాల, పీవీఎల్ నరసింహరాజు, గుడాల గోపి, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

ఆకివీడు: ప్రజా సమస్యలపై ప్రతిపక్ష హోదాలో ప్రభుత్వంతో నిరంతరం పోరాటాలు చేస్తామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. కాళ్ల మండలం పెదఅమిరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జిల్లా సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రసాదరాజు మాట్లాడుతూ కక్షపూరిత పాలనకు చరమగీతం పాడే వరకూ పోరాటం కొనసాగిస్తామన్నారు. కూటమి నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిన వైఖరిని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. నాలుగు నెలల్లోనే ప్రభుత్వ వైఫల్యాలు బయటపడుతున్నాయన్నారు. ప్రజలిచ్చిన తీర్పును వైఎస్సార్‌సీపీ శిరసా వహించి ప్రజల పక్షాన అండగా ఉంటుందన్నారు.

కార్యకర్తకు అండగా.. పార్టీ బలోపేతం దిశగా..

జిల్లాలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు, నాయకులకు, ప్రజలకు ఎలాంటి కష్టాలు వచ్చినా పార్టీ అండగా ఉంటుందని జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు భరోసా ఇచ్చారు. సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ముందుకు వెళుతున్నామన్నారు. పార్టీ అధినేత జగన్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో సమన్వయకర్తలు సమైక్యంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతి కార్యకర్త సేవలనూ గుర్తిస్తామని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటరు నమోదు కార్యక్రమాలతో పార్టీ ముందుకు వెళుతుందన్నారు.

బెల్టు షాపుల వేలం దిగజారుడుతనం : రాష్ట్రంలో మద్యం బెల్టు షాపులను కూడా వేలం వేయడం ప్రభుత్వం దిగజారుడుతనానికి నిదర్శనంగా నిలిచిందని మాజీ ఉప ముఖ్యమంత్రి, తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టు సత్యనారాయణ అన్నారు. రాష్ట్రంలో మద్యం, పేకాట, కోడిపందేలు, చోరీలు విచ్చలవిడిగా పెరిగిపోయాయన్నారు. సమాజాన్ని ఎటువైపునకు మళ్లిస్తున్నారో కూటమి ప్రభుత్వానికే తెలియాలన్నారు. కూటమి నాయకులు గత ఎన్నికల్లో ప్రజల్ని మభ్యపెట్టి, మోసగించి, ఆశలు చూపించి అధికారంలోకి వచ్చారని ధ్వజమెత్తారు. సంక్షేమ వ్యవస్థను అంతమొందించి అరాచక, అకృత్య, విచ్ఛిన్నకర వ్యవస్థకు ప్రభుత్వం మార్గం చూపుతోందన్నారు. ప్రజల ఆలోచనల్ని ప్రభుత్వ వైఫల్యాల వైపునకు మరలకుండా డైవర్షన్ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. రెడ్ బుక్ పాలనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల్ని ఇబ్బందులు పెట్టడం, అరెస్టులు చేయడం వంటివి కొనసాగుతున్నాయని మండిపడ్డారు. వీటన్నింటిపై ప్రజాపక్షంగా పోరాటాలు చేస్తామని చెప్పారు.

ప్రభుత్వ మోసాలను గుర్తిస్తున్నారు

నరసాపురం పార్లమెంట్ సమన్వయకర్త గూడూరి ఉమాబాల మాట్లాడుతూ ప్రజాసంక్షేమం కోసం వైఎస్సార్‌సీపీ పాలన సాగించిందన్నారు. నేటి కూటమి ప్రభుత్వం నాలుగు నెలల్లో చేసిన మోసాల్ని ప్రజలు గుర్తిస్తున్నారన్నారు. తాము ప్రజా తీర్పును శిరసావహిస్తూ ప్రజలకు అండగా ఉంటున్నామన్నారు. రాష్ట్రంలో అవినీతి, క్రైం రేటు పెరిగిపోయిందని, దీనికి కూటమి ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు.

సంస్థాగతంగా ముందుకు..

ఉండి నియోజకవర్గ సమన్వయకర్త పీవీఎల్ నర్సింహరాజు మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు సారథ్యంలో జిల్లాలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం కావడం ఖాయమన్నారు. సంస్థాగతంగా పార్టీని సమర్థవంతంగా ముందుకు నడిపించే సత్తా ప్రసాదరాజుకు ఉందని చెప్పారు. సమావేశంలో మాజీ మంత్రి, తణుకు నియోజకవర్గ సమన్వయకర్త కారుమూరి నాగేశ్వరరావు, పాలకొల్లు నియోజకవర్గ సమన్వయకర్త గుడాల గోపి, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

పశువుల లెక్క తేలుద్దాం

- అఖిల భారత పశుగణన సర్వే ప్రారంభం
- ఫిబ్రవరి 2 వరకు నిర్వహణ
- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు
- జిల్లాలో 248 మంది ఎన్యూమరేటర్లు, 41 మంది సూపర్‌వైజర్ల నియామకం



సాక్షి, భీమవరం: జిల్లాలో 21వ అఖిల భారత పశుగణన సర్వే మొదలైంది. ఫిబ్రవరి 2వ తేదీ వరకు మూడు నెలల పాటు జరిగే సర్వేలో 41 మంది సూపర్‌వైజర్లు, 248 మంది ఎన్యూమరేటర్లు పశ్చిమగోదావరి జిల్లాలోని పాడిపశువులు, మేకలు, గొర్రెలు, పందులు, కోళ్ల తదితర వాటి సంఖ్యను లెక్కించనున్నారు. పశుసంవర్ధకశాఖ పథకాల రూపకల్పనకు ఈ సమాచారం దోహద పడుతుందని అధికారవర్గాలు అంటున్నాయి.

1919 నుంచి గణన

1919–20లో తొలిసారిగా జాతీయ స్థాయిలో పశుగణన మొదలైంది. పశువుల జీవితకాలం తక్కువగా ఉంటుంది, అదే సమయంలో పునరుత్పత్తి శక్తి అధికంగా ఉంటుంది. అందువలన ఐదేళ్లకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం పశుగణన చేయిస్తోంది. ఇప్పటివరకు 20 సార్లు పశుగణన జరగ్గా చివరిగా 2019 ప్రారంభంలో నిర్వహించారు. అప్పటి లెక్కల ప్రకారం జిల్లాలో 44,92,449 పశుసంపద ఉన్నట్టు గుర్తించారు. గతేడాది గణన చేయాల్సి ఉండగా ఆలస్యమైంది. తొలుత ఈ ఏడాది సెప్టెంబరులోనే నిర్వహించాలని భావించినా భారీ వర్షాలు, వరదలతో మొదలు కాలేదు. ఎట్టకేలకు శుక్రవారం సర్వే మొదలుపెట్టారు. అందులో భాగంగా జిల్లాలోని ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేల చేతుల మీదుగా సర్వే బుక్‌లెట్లను పశుసంవర్ధకశాఖ అధికారులు ఆవిష్కరింపజేశారు. జిల్లా పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ కె.మురళీకృష్ణ సర్వే ప్రక్రియను పర్యవేక్షించనున్నారు. సర్వే ముగిసిన అనంతరం వాటి వివరాలను సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదిస్తారు.

పశుగణన జరిగేదిలా..

జిల్లాలోని 318 రెవెన్యూ గ్రామాల పరిధిలో 410 పంచాయతీలు ఉన్నాయి. ఎన్యూమరేటర్లు తమ పరిధిలోని ప్రతి నివాసాన్నీ సందర్శించి గేదెలు, ఆవులు, వాటి జాతులు, కోళ్లు, వాటి జాతి రకాలు, గొర్రెలు, మేకలు, పందులు, కుక్కలు తదితర పశు జాతుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. ఆవుల్లో ఒంగోలు, పుంగనూరు, జెర్సీ, హెచ్ఎఫ్ సంకరజాతి, గేదెల్లో ముర్రా, గ్రేడెడ్ ముర్రా, దేశవాలీ, కోళ్లలో టర్కీ, నాటు, లేయర్, బ్రాయిలర్ జాతుల వివరాలను పొందుపరచనున్నారు. గ్రామంలో పశువైద్యశాల ఉందా? లేదా?, పాలసేకరణ కేంద్రం, పశుగ్రాస క్షేత్రాలు ఉన్నాయా?, పశుగ్రాసాన్ని కొనుగోలు చేస్తున్నారా? లేక సొంతంగా సాగుచేస్తున్నారా ?, పశు సంపద ద్వారా ఎంత ఆదాయం వస్తుంది ? తదితర విషయాలను సేకరిస్తారు.

ప్రయోజనాలెన్నో..

పశుగణన ఆధారంగానే కేంద్ర ప్రభుత్వం కేటాయింపులు చేస్తుంది. పాడి పశువులు, మేకలు, గొర్రెలు, పందులు తదితర వాటి సంఖ్య మేరకు వ్యాధి నిరోధక టీకాలు, నట్టల వ్యాధి నివారణ మందులు సరఫరా చేస్తారు. అలాగే మేత, దాణా వివరాలు, లభ్యతను తెలుసుకునే వీలుంటుంది. పశుపోషణ జీవనాధారమైన కుటుంబాలకు అందించాల్సిన సాయంపై ప్రణాళికల రూపకల్పనకు సర్వే దోహదపడుతుంది. పశుసంపద తక్కువగా ఉన్న చోట వాటి సంతతిని పెంచేందుకు వీలుగా చర్యలు చేపడతారు. పాలు, అనుబంధ ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం, డెయిరీల ప్రోత్సాహం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై అవగాహన వస్తుంది. విపత్తుల సమయంలో సురక్షిత ప్రాంతాలకు పశువుల తరలింపు, వాటికి అందించాల్సిన దాణా, పచ్చిమేత ఎంత ఉండాలనేది అంచనా వస్తుంది.

2019 లెక్కల ప్రకారం జిల్లాలో పశు సంపద

ఆవులు	45,539	లేయర్, నాటుకోళ్లు	36,57,433
గేదెలు	1,78,137		
గొర్రెలు	38,804		
మేకలు	22,765	బ్రాయిలర్ కోళ్లు	5,48,771
పందులు	1,000		

సర్వే సిబ్బందికి సహకరించాలి



జిల్లాలో పశుగణన కచ్చితత్వంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నాం. రైతులకు మేలు జరిగేలా పశుసంవర్ధక శాఖ పథకాల రూపకల్పన, అమలుకు ఈ సర్వే దోహద పడుతుంది. సర్వే చేసేందుకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలంతా సహకరించి సమాచారం అందించాలి.

– సీహెచ్ నాగరాణి, కలెక్టర్

ఇద్దరు జడ్జీలకు పోస్టింగ్.. ఒకరు బదిలీ

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఇద్దరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జీలకు పోస్టింగ్‌లు ఇవ్వగా, ఒకరిని బదిలీ చేస్తూ హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజమహేంద్రవరంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్స్)గా పనిచేస్తున్న ఎం.అనురాధను 9వ అడిషనల్ జిల్లా అండ్ సెషన్స్ జడ్జిగా కొవ్వూరులో పోస్టింగ్ ఇచ్చారు. గుడివాడలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న బి.లక్ష్మీనారాయణకు భీమవరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తిగా నియమించారు. ఇప్పటివరకు ఈ రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. భీమవరంలో సివిల్ జడ్జిగా పనిచేస్తున్న బి.అప్పలస్వామిని విజయనగరంలోని ఎస్సీ, ఎస్టీ (పీఓఏ) యాక్ట్ కమ్, 4వ అడిషనల్ జిల్లా జడ్జిగా బదిలీ చేశారు. వీరంతా వచ్చేనెల 4వ తేదీలోపు విధుల్లో చేరాల్సి ఉంది.

నిధుల దుర్వినియోగంలో నిజం లేదు

ఉంగుటూరు: నల్లమాడు మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కండెల్లి కండెపు అరుణకుమారి, రవిపై నిధులు దుర్వినియోగం చేశారంటూ వచ్చిన ఆరోపణలు నిజం కాదని తేలింది. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి.. 2013 నుంచి ఐదేళ్లపాటు నల్లమాడు సర్పంచ్‌గా అరుణకుమారి పనిచేశారు. ఆ సమయంలో రూ.2.37 లక్షల పనులకు సంబంధించి అవినీతి జరిగిందని ఫిర్యాదులు వచ్చాయి. విచారణ సమయంలో నిధుల వినియోగంపై పంచాయతీ కార్యదర్శి రికార్డులు చూపకపోవడంతో నిధులు దుర్వినియోగం అయినట్టు తేల్చారు. ఈ మేరకు నిధుల రికవరీకి ఆదేశాలు జారీ చేశారు. అయితే పంచాయతీ కార్యదర్శుల బదిలీల సమయంలో రికార్డులు దొరకడంతో వాటిని పరిశీలించి అవకతవకలు జరగలేదని తేల్చారు. దీంతో అరుణకుమారిపై రెవెన్యూ రికవరీ యాక్టును రద్దు చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

పోలీస్ ఆయుధాలపై అవగాహన



భీమవరం త్యాగరాజ భవనంలో పోలీసు ఓపెన్ హౌస్‌లో గన్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ నయీం అస్మి

ఆకట్టుకున్న పోలీస్ ఓపెన్ హౌస్

భీమవరం: పోలీసు అమర వీరుల సంస్మరణ దినంలో భాగంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎస్పీ అద్నాన్ నయీం అస్మి చెప్పారు. శుక్రవారం స్థానిక త్యాగరాజ భవనంలో పోలీసుశాఖ ఏర్పాటుచేసిన ఓపెన్ హౌస్‌ను ఆయన ప్రారంభించారు. పోలీసు అమరవీరుల త్యాగాలు, సేవలను స్మరించుకుంటూ ఏటా అక్టోబర్ 21 నుంచి 31 వరకు పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అనంతరం పోలీసులు విధి నిర్వహణలో శాంతి భద్రతల పరిరక్షణకు ఉపయోగించే ఆయుధాల ప్రదర్శనను ఆయన తిలకించారు. అలాగే పట్టణంలోని కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనను తిలకించి వాటిని వినియోగించే తీరుతెన్నులను తెలుసుకున్నారు. అడిషినల్ ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు, డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య, ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎం.సత్యనారాయణ, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు పాల్గొన్నారు.





ఆయుధాల పనితీరును తెలుసుకుంటున్న విద్యార్థులు

28, 29 తేదీల్లో సైన్స్ ఫెయిర్



ద్వారకాతిరుమల: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ఈనెల 28, 29 తేదీల్లో సైన్స్ ఫెయిర్ నిర్వహించనున్నట్టు గురుకులం ప్రిన్సిపాల్ బి.రాణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 28న ఉదయం 11 గంటలకు ఫెయిర్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ప్రారంభ, ముగింపు కార్యక్రమాల్లో మంత్రులు డోల శ్రీ బాలా వీరాంజనేయస్వామి, నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారధి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు.

ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక గ్రీన్ సిటీలో లయన్స్ జిల్లా 316జీ లీడర్‌షిప్ ఇనిస్టిట్యూట్‌లో జరుగుతున్న రెండు రోజుల క్వెస్ట్ ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఆత్మవిశ్వాసం పెంపొందించే విషయాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, విద్యార్థుల మానసిక వికాసం, భావోద్వేగాలు నియంత్రించే విషయాలు, ప్రభావితం కలిగించే పలు అంశాలపై ఉపాధ్యాయులకు క్వెస్ట్ ట్రైనర్ కె.లక్ష్మీమూర్తి శిక్షణ ఇచ్చారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు మాట్లాడారు. అనంతరం శిక్షణ పూర్తిచేసుకున్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందజేశారు. లయన్స్ జిల్లా చైర్మన్ వి.సురేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మొదటి ఉప గవర్నర్ ఎన్‌వీవీఎస్ పాపారావు నాయుడు, రెండో ఉప గవర్నర్ డి.సుబ్బారావు, లయన్స్ జిల్లా నాయకులు ఎం.శ్రీహరి, వి.రామారావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మితే లాస్.. కొంటే షాక్

మార్కెట్‌లో నిమ్మ ధర పరిస్థితి


జంగారెడ్డిగూడెం మార్కెట్‌కు వచ్చిన నిమ్మకాయలు

జంగారెడ్డిగూడెం: నిమ్మ పండించే రైతులకు గిట్టుబాటు ధర రాదు.. మార్కెట్‌లో నిమ్మ సామాన్యులకు అందుబాటులో ఉండటం లేదు. గత కొన్ని రోజులుగా నిమ్మ ధరలు పెరిగాయి. అలాగని రైతుకు సరైన గిట్టుబాటు ధర లేదు. నిమ్మ పంట దిగుబడి తక్కువగా ఉండటం, ఎగుమతులకు ఎక్కువ చొరవ చూపడంతో నిమ్మధర పెరుగుతోందని ఇంతవరకు అందరూ భావించారు. అయితే ప్రస్తుతం జంగారెడ్డిగూడెం నిమ్మ మార్కెట్‌లో పరిస్థితి మరోలా ఉంది. ఏలూరు జిల్లాలో 8,600 ఎకరాల్లో రైతులు నిమ్మ పంటను పండిస్తున్నారు. జంగారెడ్డిగూడెం, ద్వారకాతిరుమల, పెదవేగి, కామవరపుకోట, లింగపాలెం తదితర మండలాల్లో ఈ పంట ఎక్కువ సాగుచేస్తున్నారు.

జంగారెడ్డిగూడెం, ఏలూరు, గోపన్నపాలెం, ద్వారకాతిరుమలలోని హోల్‌సేల్ మార్కెట్‌లో నిమ్మ కేజీ ధర కాయ సైజును బట్టి రూ.18 నుంచి రూ.22 మధ్య పలుకుతోంది. కేజీకి సుమారుగా 20 నుంచి 25 కాయల వరకు తూగుతున్నాయి. రైతుకు సగటున ఒక నిమ్మకాయకు సుమారు రూ. 1 వరకు ధర పలుకుతోంది. రిటైల్ మార్కెట్‌లో ధరను చూసిన రైతులు తమ పంటకు మంచి ధర వస్తుందని ఆశిస్తే భంగపాటు తప్పడం లేదు. ఆరుగాలం పండించిన పంట మార్కెట్‌కు తీసుకువస్తే సరైన ధర లభించడం లేదు.

రిటైల్ మార్కెట్‌లో నిమ్మకాయ ప్రజల జేబులకు చిల్లు పెడుతోంది. సాధారణంగా ఎలాంటి శుభకార్యం జరిగినా నిమ్మకాయను ఏదో రకంగా వాడుతుంటారు. హోటల్స్, ఇళ్లల్లో సైతం నిమ్మ వినియోగం తెలియంది కాదు. ఈ క్రమంలో నిమ్మకాయలు కొందామని మార్కెట్‌కు వెళితే వ్యాపారులు డజను (12 కాయలు) రూ.40 వరకు అమ్ముతున్నారు. అంటే వినియోగదారుడు ఒక్కొక్క నిమ్మకాయకు రూ.3 పైగా చెల్లించాల్సి వస్తోంది. వర్షాలకు నిమ్మ ధర పతనమైందని.. ఎగుమతులు ఆగిపోయాయని రైతులకు చెబుతున్నారు. ఒడిశా, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల్లో తుఫాన కారణంగా ధర మరింతగా పడిపోయిందని వ్యాపారులు పేర్కొంటున్నారు. అదే సమయంలో రిటైల్ మార్కెట్‌లో మాత్రం నిమ్మ ధర బెంబేలెత్తిస్తోంది. ఎగుమతులు నిలిచిపోతే మార్కెట్‌లోకి నిమ్మకాయలు ఎక్కువగా వస్తాయి. రైతుకు ధర తగ్గినప్పుడు, రిటైల్ మార్కెట్‌లోనూ ధర తగ్గాలి. అందుకు విరుద్ధంగా రైతుకు ధర తగ్గించి, రిటైల్ మార్కెట్‌లో మాత్రం ఎక్కువ ధరను అమ్ముతున్నారు.

ధర ఆశించినా దక్కలేదు



బహిరంగ మార్కెట్‌లో ధరను చూసి తమ పంటకు మంచి రేటు వస్తుందని ఆశించాం. తీరా మార్కెట్‌కు నిమ్మకాయలు తీసుకువచ్చిన తరువాత ధర చూస్తే ఏం చేయాలో తెలియని పరిస్థితి. కేజీ ఒక్కింటికి గరిష్ఠంగా రూ.22 మాత్రమే లభించింది. ఆరుగాలం పండించిన పంటకు సరైన ధర రావడం లేదు. రిటైల్ మార్కెట్లో మాత్రం నిమ్మకాయల ధర తగ్గలేదు.

– దాకారపు నరసింహమూర్తి, నిమ్మరైతు, టిక్కినవారిగూడెం

నిమ్మ రైతులకు న్యాయం చేయాలి



ఎగుమతులు నిలిచిపోయాయని చెబుతూ రైతులకు ధర తగ్గించేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో డజను రూ.40 పలుకుతోంది. మా వద్ద కేజీ రూ.22కు కొనుగోలు చేసి ఏకంగా రెట్టింపు ధరకు నిమ్మను అమ్ముతున్నారు. మాకు మాత్రం ఏటా పెట్టుబడులు పెరుగుతూనే ఉన్నాయి. దానికి తగ్గట్టుగా ధర పెరగడం లేదు. రైతుకు నిమ్మపంటకు సరైన ధర లభించేలా అధికారులు న్యాయం చేయాలి.

– నల్లగోపు వెంకటరామారావు, నిమ్మరైతు, అమ్మపాలెం

ఎక్సైజ్ దాడులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెం గ్రామంలో కుక్కల రవిబాబు నుంచి 10 మద్యం సీసాలు, పేరంపేటలో మరీదు వెంకట్ నుంచి 8 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నగల చోరీపై ఫిర్యాదు

ముదినేపల్లి రూరల్: బీరువాలో దాచి ఉంచిన నగలు చోరీకి గురయ్యాయంటూ పోలీసుస్టేషన్ ఫిర్యాదు చేశారు. స్థానిక ముస్లిం బజారులో నివసించే అబ్దుల్ సలాం టీవీ మెకానిక్‌గా పనిచేస్తుంటాడు. ఇటీవలే కుదువ పెట్టిన బంగారు నగలను బుధవారం విడిపించి ఇంట్లోని బీరువాలో భద్రపరిచారు. డ్వాక్రా గ్రూపులో సభ్యురాలిగా ఉన్న సలాం భార్య నజీయా బుధవారం సాయంత్రం ఇంటికి సమీపంలో నిర్వహించిన డ్వాక్రా గ్రూపు సభ్యుల సమావేశానికి వెళ్లింది. ఇంటికి తాళం వేయకుండా వెళ్లడంతో సమావేశం పూర్తయిన తర్వాత ఇంటికి వచ్చి చూస్తే.. బీరువాలోని నగలు చోరీకి గురయినట్లు గుర్తించారు. బీరువాలో నగలు దాచిన సంగతి పరిచయస్తురాలైన ఒక మహిళకు తెలియజేయడంతో ఆమె ఈ నగలను చోరీ చేసినట్లు ఫిర్యాదు చేసింది.

క్లుప్తంగా

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుతో అన్యాయం


పోస్టర్లు విడుదల చేస్తున్న ముస్లిం నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ) : వక్ఫ్‌బోర్డుకు కేంద్ర ప్రభుత్వం సవరణ చేయడం అంటే ముస్లిం సమాజానికి తీరని అన్యాయం చేయడమేనని జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ రఫీ, నాయకులు సర్దార్ ఖాన్, మహబూబ్ బాషా, నౌషాద్ మొహియుద్దీన్, అబ్దుల్ ఘనీ, గఫార్‌ఖాన్, షాజహాన్, ఎండీ రఫీలు పేర్కొన్నారు. పెద్ద మసీదు వద్ద శుక్రవారం ముస్లిం నాయకులు మాట్లాడుతూ వక్ఫ్ అంటే అల్లా మార్గంలో ఆస్తులు దానం చేయడమన్నారు. బిల్లుకు నిరసనగా నవంబర్ మూడున చలో విజయవాడకు వెళ్తున్నట్లు చెప్పారు.

ఏపీ జేఏసీ మహిళా విభాగం కమిటీల ఎన్నిక


మహిళా విభాగం కమిటీల ఎన్నికల్లో పాల్గొన్న ఉద్యోగులు

ఏలూరు(మెట్రో): మహిళా ఉద్యోగులు పని చేసే చోట కనీస సౌకర్యాలు కల్పించాలని ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం రాష్ట్ర చైర్ పర్సన్ పారె లక్ష్మి, సెక్రటరీ సునీత ప్రభుత్వాన్ని కోరారు. రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కార్యాలయంలో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ కె.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన మహిళా విభాగం సమావేశంలో వారిద్దరూ పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఏలూరు డివిజన్/జంగారెడ్డి గూడెం డివిజన్ కమిటీల్ని ఎన్నుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వరరావు

ద్వారకాతిరుమల: వాహనం ఢీకొని తాతా మనుమడు గాయపడిన ఘటన మండలంలోని రాళ్లకుంటలో శుక్రవారం జరిగింది. నిడమర్రు మండలం పత్తేపురానికి చెందిన వెంకటేశ్వరరావు, మండలంలోని దొరసానిపాడు నుంచి తన నాలుగేళ్ల మనుమడు భవానీతో బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఘటనా స్థలం వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం ఢీకొని రోడ్డుపై పడిపోయారు. తీవ్ర గాయాలు పాలైన తాతా మనుమడిని స్థానికులు పీహెచ్‌సీకి తరలించగా, వైద్యుడు ప్రవీణ్‌కుమార్, సిబ్బంది వారికి చికిత్సనందించారు.

'వంక' ఆశయాల సాధనకు కృషి చేయాలి


మాట్లాడుతున్న విశాలాంధ్ర సంపాదకుడు ఆర్‌వీ రామారావు, చిత్రంలో ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ తదితరులు

తణుకు టౌన్: సాతంత్ర్య సమర యోధుడు, అసెంబ్లీ టైగర్‌గా ప్రసిద్ధి చెందిన వంక సత్యనారాయణ ఆశయ సాధనకు పునరంకితం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు చెప్పారు. శుక్రవారం తణుకులోని వంక సత్యనారాయణ స్వరాజ్య భవన్‌లో జరిగిన కామ్రేడ్ వంక సత్యనారాయణ 6వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అధ్యక్షత వహించారు. ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ తాను విద్యార్థి, యువజన నాయకుడిగా ఉన్న రోజుల్లో వంక సత్యనారాయణ మార్గదర్శకులని చెప్పారు. విశాలాంధ్ర పత్రిక సంపాదకుడు ఆర్‌వీ రామారావు 'ప్రస్తుత రాజకీయాలు– పత్రికా విలువలు' అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. ఇందిరా గాంధీ ఎమర్జెన్సీ ప్రకటించి ప్రజల ప్రాథమిక హక్కులను హరిస్తే నేడు మోదీ అప్రకటిత ఎమర్జెన్సీతో ప్రమాదం ఏర్పడిందన్నారు. నేడు పత్రికా స్వేచ్ఛ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కోనాల భీమారావు మాట్లాడుతూ జిల్లాను పారిశ్రామికంగా, విద్య, వ్యవసాయ రంగాల్లో ముందుంచేందుకు వంక సత్యనారాయణ కృషి చేశారని చెప్పారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మాట్లాడుతూ తన తండ్రి చెప్పిన వాటినే పాటిస్తూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో దారిదీపం పత్రికా సంపాదకుడు డీవీవీఎస్ వర్మ, సీపీఎం జిల్లా కార్యదర్శి బలరామ్, డాక్టర్ వంక రామదాసు, డాక్టర్ వంక వసుంధర, మున్సిపల్ మాజీ చైర్మన్ వంక రాజకుమారి, బీ రమేష్ చంద్రబాబు, అరుణ రేఖ, బీ సీతా మహాలక్ష్మి, సంకు మనోరమ, ప్రముఖ కవి వీఎస్‌వీ ప్రసాద్ తదితరులు మాట్లాడారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- అర్ధరాత్రి దాటినా ఇసుక అక్రమ రవాణా
- అంతా అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే..


ముసునూరు పోలీస్ స్టేషన్ వద్ద పట్టుబడిన ట్రాక్టర్లు

ముసునూరు: మండలంలో మట్టి అక్రమ రవాణాతో జేబులు నింపుకున్న టీడీపీ నేతలంతా ఇప్పుడు ఇసుక అక్రమాలు ప్రారంభించారు. వలసపల్లి, యల్లాపురం గ్రామాల్లో ఇసుక రీచ్‌లను మంత్రి కొలుసు పార్థసారథి గురువారం మధ్యాహ్నం ప్రారంభించి, వెళ్లిన గంటల వ్యవధిలోనే అక్రమాలకు తెరలేచింది. అక్రమ రవాణాను సహించం, నియమిత వేళల్లోనే తోలకం నిర్వహించాలి.. దూరాభారాన్ని బట్టే రవాణా చార్జీలు వసూలు చేయాలి అంటూ రీచ్‌ల ప్రారంభ వేళ మంత్రి చెప్పిన మాటలను తుంగలో తొక్కి రాత్రి పది గంటలు దాటినా వందలాది ఇసుక ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక తరలిస్తూనే ఉన్నాయి. దీంతో స్థానికులు ఆగ్రహించి ముసునూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి, రాత్రిపూట 12 ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అటు వెళ్లగానే ఇటు మళ్లీ అర్ధరాత్రి వేళ వరకు ఇసుక తరలింపు కొనసాగిందని స్థానికులు చెబుతున్నారు. గుళ్లపూడిలో లోడింగ్ చార్జీలు రూ.600 వసూలు చేస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పేరు చెప్పి ప్రతి గ్రామంలోనూ ట్రాక్టర్ ట్రక్కుకు రూ.100 వసూలు చేస్తున్నట్లు ట్రాక్టర్ యజమానులు పేర్కొంటున్నారు. దీంతో తొలి రోజు నుంచే తెలుగు తమ్ముళ్ల అత్యుత్సాహానికి ఉచిత ఇసుక పంపిణీ అభాసుపాలైందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రీచ్‌ల నుంచి ఉచితంగా ఇసుకను సేకరించి, గృహావసరాలు కాకుండా, పట్టణాలకు తరలించి, యథేచ్ఛగా అమ్ముకుంటున్నట్లు స్థానికుల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తక్షణమే రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం ఇసుక దోపిడీని నిలువరించి, పేదల గృహ నిర్మాణాలకు ఇసుక ఉచితంగా అందేలా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు. గుళ్లపూడిలో లోడింగ్ చార్జీకి అధిక వసూళ్ల విషయం తమ దృష్టికి వచ్చిందని, వారితో మాట్లాడి, రూ.400 మాత్రమే లోడింగ్ చార్జీ వసూలు చేయాలని చెప్పినట్లు తహసీల్దార్ పురుషోత్తమ శర్మ తెలిపారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి



ఏఐటీయూసీ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రామారావు

ఏలూరు (టూటౌన్) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలపై, ప్రైవేటీకరణ విధానాలపై ఏఐటీయూసీ నిర్వహిస్తున్న పోరాటాలు, ఆందోళనల్లో ఏఐటీయూసీ అనుబంధ ఉద్యోగ, కార్మిక సంఘాలు క్రియాశీలకంగా పాల్గొనాలని ఏఐటీయుసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. ఏలూరు ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ డాంగే అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన మోదీ ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మగారాన్ని ప్రైవేట్ పరం చేయడానికి తీవ్రంగా కృషి చేస్తుందని తెలిపారు. నవంబర్ 10న ఏలూరులో జరగనున్న ఏఐటీయూసీ అనుబంధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాల రాష్ట్ర మహాసభను జయప్రదం చేసేందుకు పనిచేయాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కంకిపాటి బుచ్చిబాబు కార్యకలాపాల రిపోర్టును సమర్పించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, ఏఐటీయూసీ నాయకులు కె.కృష్ణమాచార్యులు, తొర్లపాటి బాబు, చాట్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని యువకుడి మృతి

తాడేపల్లిగూడెం రూరల్: యువకుడు ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన మండలంలోని మాధవరంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మాధవరం గ్రామానికి చెందిన సాయికుమార్ (20)తో దుర్గాభవానికి ఈ ఏడాది జులై 4న వివాహమైంది. 20 రోజుల క్రితం వేరు కాపురం పెట్టారు. గురువారం దుర్గాభవానికి సాయికుమార్ వీడియో కాల్ చేసి చనిపోతానని చెప్పాడు. దీంతో కుటుంబసభ్యులు వెళ్ళి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడని.. దుర్గాభవాని రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్టు

పాలకోడేరు: ఈ నెల 19న పాలకోడేరుకు చెందిన బాలికను కిడ్నాప్ చేసిన నిందితుడు మద్దాల మణికంఠను శుక్రవారం అరెస్టు చేసినట్లు ఎస్సై రవివర్మ తెలిపారు. భీమవరం నరసయ్య అగ్రహారంలో ఉన్నాడన్న సమాచారం మేరకు దాడిచేసి అరెస్టు చేసి భీమవరం కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నేటి నుంచి బాస్కెట్‌బాల్ పోటీలు

పెనుమంట్ర: అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ అండర్ –17 బాస్కెట్‌బాల్ పోటీలు ఈ నెల 26 నుంచి 28 వరకు మార్టేరు ఎస్వీజీ ఉన్నత పాఠశాల ఆవరణలో జరుగుతాయని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎ.అంజలి శుక్రవారం తెలిపారు. మార్టేరులో ఆమె విలేకరులతో మాట్లాడుతూ 3 రోజుల పాటు జరిగే ఈ పోటీలను శనివారం సాయంత్రం ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అధ్యక్షత జరిగే కార్యక్రమంలో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, మంత్రి నిమ్మల రామానాయుడు, కలెక్టర్ సి నాగరాణి ప్రారంభిస్తారని తెలిపారు. పోటీల్లో 13 జిల్లాలకు చెందిన 400 మంది పైగా క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. నవంబరు 21న చత్తీస్ఘడ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర స్థాయి బాలబాలికల జట్టును ఎంపిక చేస్తారన్నారు.

భారీగా సెల్‌ఫోన్ల రికవరీ

రూ. 21.56 లక్షల విలువైన ఫోన్లు అందజేసిన ఎస్పీ


రికవరీ అయిన సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ కేపీ శివకిషోర్, అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో చోరీకి గురైన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ విలేకరుల సమావేశం నిర్వహించి ఫోన్లు యజమానులకు వాటిని అందజేశారు. ఏలూరు సీసీఎస్, సైబర్ క్రైమ్ టీమ్ సంయుక్తంగా ఆయా రాష్ట్రాలు, జిల్లాల్లో గాలిస్తూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఫోన్లు గుర్తించి రికవరీ చేశారు. 13వ దఫా 154 మొబైల్ ఫోన్లను పోలీసులు రికవరీ చేసి యజమానులకు అందజేశారు. వీటి విలువ సుమారు రూ.21.56 లక్షలు ఉంటుందని పోలీసుల అంచనా. సీసీఎస్ సీఐ రాజశేఖర్, సైబర్ సెల్ సీఐ ఐ.గోపాలకృష్ణ, ఎస్ఐ బీఎంవీ మధురాజా ఆధ్వర్యంలో సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా, ఎన్టీఆర్ జిల్లా, అంబేద్కర్ కోనసీమ జిల్లా, కృష్ణా, విశాఖపట్నం, తూర్పుగోదావరి, విజయనగరం, తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి సెల్ ఫోన్లు రికవరీ చేశారు. మొదటి 12 దఫాలుగా ఏలూరు జిల్లా వ్యాప్తంగా 1,606 సెల్‌ఫోన్లు పోలీసులు రికవరీ చేశారు. వీటి విలువ సుమారుగా రూ.3.12 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. జిల్లాలో ఎవరైనా తమ సెల్ ఫోన్లు పోగొట్టుకుంటే.. టోల్‌ఫ్రీ నెంబర్ 95503 51100ను అందుబాటులోకి తెచ్చామన్నారు. జిల్లాలో సెల్‌ఫోన్స్ రికవరీ 48 శాతంగా ఉందన్నారు. సెల్‌ఫోన్లు చోరీకు గురైతే టోల్‌ఫ్రీ నెంబర్‌కు వాట్సప్‌లో తమ పూర్తి వివరాలు, ఐఎంఈఐ నెంబర్, మొబైల్ ఫోన్ నెంబర్, బిల్లు, చిరునామా పెట్టాలని సూచించారు.

రాయలం సచివాలయ ఆకస్మిక తనిఖీ


సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరం అర్బన్ : రాయలం గ్రామాభివృద్ధికి సంబంధిత ఉద్యోగులంతా కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం మండలంలోని రాయలం గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని శుక్రవారం కలెక్టర్ అకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ భవనం కింది అంతస్తులో నిర్వహిస్తున్న వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వివరాలు ఆరా తీశారు. సచివాలయ సిబ్బంది అందరూ కలిసికట్టుగా ప్రజలకు చేరువయ్యేలా చూడాలని ఆదేశించారు. ప్రత్యేక ఆధార్ సవరణ క్యాంపుల సమాచారాన్ని గ్రామ ప్రజలకు చేరవేయడంలో అలసత్వం కనిపిస్తుందని, భవిష్యత్‌లో ఇలాంటి చర్యలను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజలకు ఏ సర్వీస్‌లను ఎన్ని రోజుల్లో అదజేస్తున్నారు అని అడిగి సంబంధిత వెబ్ పోర్టల్‌ను పరిశీలించారు. రాయలం పంచాయతీ పరిధిలో రూ.1.48 కోట్ల వ్యయంతో చేపట్టిన వివిధ పనులపై ఆరా తీశారు. ఏఏ పనులు ఎంత ఖర్చుతో ఏ తేదీల్లో చేపట్టారో పరిశీలించి ఫొటోలతో సహా నివేదిక అందజేయాలని డీపీఓ వి.అరుణ, ఎంపీడీఓలను ఆదేశించారు. పంచాయతీ పరిధిలో భవన నిర్మాణాలకు వ్యాపార సముదాయాలకు అనుమతించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి పలు వివరాలు ఆరా తీశారు. గ్రామ ప్రజలు రాయలం మురుగు డ్రెయిన్ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. మురుగు డ్రెయిన్‌తో పంట పొలాల సాగుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సార్వా పంట వేయలేదని మురుగు కాలువ పూడికతీత పనుల నిర్వహణకు నిధులను మంజూరు చేసి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఈ విషయంపై కలెక్టర్ స్పందిస్తూ ఇప్పటికే ప్రతిపాదనలను సమర్పించామని, నిధులు మంజూరైన వెంటనే పనుల ప్రారంభిస్తారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ ఎస్.మురళీ గంగాధరరావు, సెక్రటరీ డీఎస్ పద్మాజీరావు తదితరులు ఉన్నారు.

జి.కొత్తపల్లిలో అనుమానాస్పద మృతి

ద్వారకాతిరుమల: మండలంలోని జి.కొత్తపల్లిలో ఒక వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. దీనిపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్సై టి.సుధీర్ తెలిపిన కథనం ప్రకారం.. జి.కొత్తపల్లికి చెందిన స్వర్ణల రజని తన భర్త వినోద్‌కుమార్ (31) ఈనెల 23 సాయంత్రం 6 గంటల సమయం నుంచి కనిపించడం లేదని, 24 సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వినోద్‌కుమార్ మృతదేహం శుక్రవారం ఉదయం జి.కొత్తపల్లిలోని ఊర చెరువులో కనిపించింది. తన భర్త మృతదేహం చెరువులోని నీటిలో తేలుతూ, ఉబ్బిపోయి, శరీరం ఊడిపోయి ఉందని, దీనిపై విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని రజని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఎస్సై సుధీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అక్రమ మద్యం స్వాధీనం


పెదపాడు మండలంలోని సత్యవోలులో స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

పెదపాడు: మండలంలోని సత్యవోలులో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలను పెదపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని సత్యవోలులో అక్రమంగా నిల్వ ఉంచినట్లు సమాచారం రావడంతో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో బేత దుర్గా ఫణీంద్ర బాబు వద్ద మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు.

29, 30 తేదీల్లో బాల్ బ్యాడ్మింటన్ సెలక్షన్స్

వీరవాసరం: జిల్లా విద్యాశాఖ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2024 –25 విద్యా సంవత్సరానికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్–14 బాల్ బ్యాడ్మింటన్ బాల బాలికల ఎంపిక పోటీలు అక్టోబర్ 29, 30 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పశ్చిమగోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి పీఎస్ఎన్ మల్లేశ్వరరావు శుక్రవారం తెలిపారు. చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోటీలు జరుగుతాయన్నారు. ఇతర వివరాలకు 70139 12527 నెంబరులో సంప్రదించాలన్నారు.

గుండెపోటుతో బస్సులో కండక్టర్ మృతి

పెనుగొండ : విధులు నిర్వర్తిస్తూ ఆర్టీసీ బస్సులోనే గుండెపోటుతో ఓ కండక్టర్ మృతి చెందాడు. శుక్రవారం రాత్రి కొవ్వూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు భీమవరం నుంచి రాజమండ్రి వెళ్తుండగా.. బస్సు మండలంలోని వడలి వచ్చేసరికి డ్యూటీలో ఉన్న కండక్టర్ కేఎస్ నారాయణ గుండెపోటుతో అకస్మాత్తుగా బస్సులోనే కుప్పకూలి మృతిచెందాడు. నారాయణ మృతదేహాన్ని 108లో తణుకు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

నాగమ్మతల్లికి బంగారు ఆభరణాలు సమర్పించిన భక్తులు



తణుకులో నాగమ్మ తల్లికి బంగారు ఆభరణాలు అందజేస్తున్న భక్తులు

తణుకు అర్బన్: తణుకు జాతీయరహదారి సమీపంలోని గౌతమీ సాల్వెంట్ ప్రాంతంలో వేంచేసియున్న శ్రీచక్రసహిత నాగదుర్గాదేవి (నాగమ్మ తల్లి) ఆలయంలో శుక్రవారం అమ్మవారికి భక్తులు ముక్కుపుడక, బొట్టుబిళ్ల బంగారు ఆభరణాలు అందజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన గంధం బాబు, సుజాత దంపతులు, కుమార్తెలు స్నేహాంజలి, నవీనలు అమ్మవారికి ఆభరణాలతోపాటు చీర, మిఠాయిలు, పసుపు, కుంకుమ అమ్మవారికి సమర్పించారు. ఆలయ నిర్వాహకురాలు జక్కంపూడి దుర్గ పూజాధికాల అనంతరం నాగమ్మతల్లిని ప్రత్యేకంగా అలంకరించారు.

సైన్స్ ఫెయిర్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



సైన్స్ ఫెయిర్‌లో ప్రథమ స్థానం సాధించిన ఆరుగొలను గురుకుల కళాశాల విద్యార్థులు

తాడేపల్లిగూడెం రూరల్: ఏలూరు జిల్లా వట్లూరులో జరిగిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో తాడేపల్లిగూడెం మండలం ఆరుగొలను డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ సాంఘిక, సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రదర్శనలు ప్రథమ స్థానంలో నిలిచాయి. సీనియర్ విభాగంలో జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన ధాన్యాన్ని సంరక్షించే విధానం, జూనియర్ విభాగంలో మ్యాథ్స్ ప్రాజెక్టు ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపల్ బి.శ్రీనివాస్, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

యాప్‌లో వివరాలు నమోదు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో-2 పీఎంకే.జ్యోతి

తాడేపల్లిగూడెం రూరల్: మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం నియోజకవర్గంలోని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు వి.హనుమ, పీఎంకే.జ్యోతిలు కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన యూనిక్ ఐడీ కార్డులు ప్రక్రియ, యూ డైస్ ప్లస్, ఎస్ఎస్ఎంపీ పరీక్షలు మార్కుల నమోదు ప్రక్రియ తదితర అంశాలపై చర్చించారు. అపుస్మా జోన్ చైర్మన్ సుంకర శ్రీనివాస్, ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించిన ఎంపీడీవో



జెడ్పీహెచ్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెద తాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని శుక్రవారం ఎంపీడీవో ఎం.విశ్వనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని వండి వడ్డించాలని మధ్యాహ్న భోజన పథకం సిబ్బందికి సూచించారు. అనంతరం ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. ఆయన వెంట డీడీవో టి.రవిచంద్ర, జూనియర్ అసిస్టెంట్ భరత్‌కుమార్, హెచ్ఎం షేక్ లాల్ బీబీ తదితరులు ఉన్నారు.

సహాన కుటుంబాన్ని ఆదుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): గుంటూరు జిల్లా తెనాలి పట్నానికి చెందిన దళిత యువతి సహానను ఓ రౌడీ షీటర్ అతి కిరాతకంగా హత్య చేయడాన్ని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఖండించారు. సహానా కుటుంబానికి మాల మహానాడు తరుపున ప్రగాఢ సంతాపం తెలిపారు. పట్టణంలో శుక్రవారం మంగరాజు మాట్లాడుతూ హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సహాన కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వం, అధికారులను కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితుల మీద, మహిళల మీద దాడులు, అత్యాచారాలు, మర్డర్లు ఎక్కువగా జరుగుతున్నాయని, ప్రభుత్వం వాటిని అరికట్టాలని మంగరాజు విజ్ఞప్తి చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం తగు చర్యలు చేపట్టాలని కోరారు.

సేవలకు సెలవు

- సచివాలయాల్లో అందని కీలక సేవలు
- పునరుద్ధరించని కూటమి ప్రభుత్వం
- ప్రజలకు తప్పని తిప్పలు



తణుకులో 9వ నంబరు వార్డు సచివాలయం

తణుకు: గతంలో ప్రభుత్వ సేవలను పొందేందుకు ప్రజలు మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. ప్రజల కష్టాలను గమనించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. రెండు వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా ప్రజలకు ఇంటి ముంగిటే సేవలను అందించింది. సచివాలయంలో వివిధ శాఖలకు సంబంధించిన ఉద్యోగులను నియమించి ప్రజల సమస్యలను అక్కడే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే వలంటీర్ల సేవలకు మంగళం పాడింది. సచివాలయాల ద్వారా అందించే కీలకమైన సేవలను నిలిపివేసింది. అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడిచినా సేవలను పునరుద్ధరించకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.

సచివాలయాల్లో 545 రకాలు సేవలు...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సచివాలయాల ద్వారా 545 రకాల సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చింది. వాటికి అనుసంధానంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా వ్యవసాయ, ఆరోగ్య సేవలను అందించింది. మండల కేంద్రాలకు వెళ్లే బాధ లేకుండా ఇంటి ముంగిటే సేవలు అందించడంతో సచివాలయాలకు ప్రజల నుంచి ఆదరణ లభించింది. తణుకు నియోజకవర్గంలోని తణుకు పట్టణంలోని 27 సచివాలయాలు ఉండగా తణుకు మండలంలో 14, అత్తిలి మండలంలో 20, ఇరగవరం మండలంలో 21 మొత్తం 82 గ్రామ, వార్డు సచివాలయాలు ఉన్నాయి.

తెరుచుకోని వెబ్‌సైట్లు

కూటమి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి సచివాలయాల వైభవం తగ్గిపోయింది. వలంటీర్ వ్యవస్థ లేకపోవడంతో సచివాలయ ఉద్యోగులే పింఛన్లు పంపిణీ చేస్తున్నారు. ఇది మంచి ప్రభుత్వం ప్రచారాన్ని సైతం వారేచేపట్టారు. గతంలో సచివాలయాల ద్వారా అందించిన సేవలు ప్రస్తుతం తగ్గుతూ వస్తున్నాయి. కులం, ఆదాయం, 1బీ, తదితర సాధారణ సేవలు మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. ప్రజలకు ఎంతో అవసరమైన రేషన్ కార్డులు, నూతన పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, తదితర సేవలకు సంబంధించిన వెబ్‌సైట్లు ఓపెన్ కావడంలేదు. దీంతో సచివాలయాల చుట్టూ ప్రజలు నిత్యం తిరుగుతున్నారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు నెలలు గడిచినా వెబ్‌సైట్లు తెరుచుకోకపోవడంతో సచివాలయ ఉద్యోగులు సైతం ఏం చేయాలో తెలియక సందిగ్ధంలో ఉండిపోయారు. కొత్తవాటిని మంజూరు చేయకపోయినా గతంలో ఉన్న వాటిలో తప్పొప్పుల సవరణలు చేసేందుకైనా అవకాశం కలిపిస్తే బాగుంటుందని సచివాలయ ఉద్యోగులే అభిప్రాయపడుతున్నారు.

నాడు విమర్శలు.. నేడు సేవలు..

సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసే సమయంలో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై తెదేపా విమర్శలు చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం సచివాలయ వారితోనే సేవలు అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా సామాజిక పింఛన్ల పంపిణీ, ఇది మంచి ప్రభుత్వంలో భాగంగా ఇంటింటికి స్టిక్కర్లు అతికించేకార్యక్రమం, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలను సచివాలయ ఉద్యోగుల ద్వారానే చేయిస్తోంది. అయితే ప్రజలకు అవసరమైన అన్ని రకాల సేవలను మళ్లీ సచివాలయాల్లో పునః ప్రారంభిస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుందని అటు ఉద్యోగులు, ఇటు ప్రజలు పేర్కొంటున్నారు.

సైబర్ క్రైం పై అవగాహన అవసరం



డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూరల్ సీఐ రమేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పెంటపాడు: కళాశాల విద్యార్థులు సైబర్ నేరాల అదుపుపై పూర్తి అవగాహన పెంచుకోవాలని గూడెం రూరల్ సీఐ రమేష్ పేర్కొన్నారు. శుక్రవారం పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలు-తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సమావేశం ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు సూచనల మేరకు నిర్వహించారు. ఆన్‌లైన్‌లో నగదుబదిలీ, దిశా చట్టం, పోక్సు చట్టం, వాహనాల డ్రైవింగ్, హెల్మెట్ వాడకం, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు, విద్యార్థులు కెరీర్‌లో ముందుకు వెళ్లేందుకు వీలుగా తీసుకోవాల్సిన చర్యలపై సీఐతో పాటు, పెంటపాడు ఎస్సై స్వామిలు తెలిపారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి, లెఫ్టినెంట్ ఎంవీ ప్రేమ్‌సాగర్, రచయిత సుంకర గోపాల్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గంధం వాణి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ విజయబాబు, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వారానికోసారి డ్రైడేగా పాటించాలి



తణుకులో ఫ్రైడే డ్రైడే ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తణుకు అర్బన్: వారానికోసారి ఇంటి ఆవరణలో ఉన్న నిరుపయోగ నీటి నిల్వలు తొలగించుకుంటే దోమల వ్యాప్తిని అరికట్టవచ్చని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 27వ వార్డులో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే డ్రైడే, వెక్టార్ కంట్రోల్ హైజీన్, మస్కిటో లార్వా డెన్సిటీ కార్యక్రమాలను ఆయన క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి మాట్లాడారు. దోమ వదిలిన లార్వా 8 నుంచి 10 రోజుల లోపు దోమగా మారుతుందని ఈ క్రమంలోనే ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి పరిసరాలను శుభ్రం చేసుకుంటే దోమ పుట్టకుండా లార్వా దశలోనే అంతమొందించవచ్చని సూచించారు. దోమ కాటు ద్వారా మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా వ్యాధులు రాకుండా నిలువరించుకోవచ్చని అన్నారు. చెత్త, వ్యర్థాలను డ్రెయినేజీల్లో పారవేస్తే నీటి పారుదల నిలిచిపోయి దోమలవ్యాప్తి పెరుగుతుందని స్పష్టం చేశారు. అనంతరం ఫ్రైడే డ్రైడే ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫైలేరియా యూనిట్ సూపర్‌వైజర్ కె.సత్యనారాయణ, వార్డు హెల్త్ సెక్రటరీ కె.వెంకటలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ ఎస్.తాతాజీ, ఆశ కార్యకర్త డి.కుమారి పాల్గొన్నారు.

సాంకేతికతను భవిష్యత్‌కు ఉపయోగించుకోవాలి



విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

తణుకు టౌన్: విద్యార్థినులు సాంకేతికతను తమ భవిష్యత్ ఉన్నతి కోసం ఉపయోగించుకోవాలని జేజీఎం టెలిఫోన్ నిగమ్ రిటైర్డ్ సీనియర్ లెవెల్ ఆఫీసర్ కె ఆంజనేయ శర్మ చెప్పారు. శుక్రవారం తణుకులోని ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ యూ లక్ష్మీసుందరి బాయి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆంజనేయ శర్మ మాట్లాడుతూ కళాశాల విద్య విద్యార్థుల జీవిత భవిష్యత్‌కు మైలు రాయి వంటిదన్నారు. ఈసమయాన్ని సద్వినియోగం చేసుకుని ఎన్నో అద్భుతాలు సృష్టించవచ్చని విద్యార్థినులకు సూచించారు. ఈకార్యక్రమంలో కళాశాల చైర్మన్ కేవీ సుబ్బారావు, కోశాధికారి నందిగం సుధాకర్, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు, వీజీఎస్ స్కూల్ సెక్రటరీ చిట్టూరి రీనా సాయి, తదితరులు మాట్లాడారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథి ఆంజనేయ శర్మను సత్కరించారు. ఈసందర్భంగా కళాశాల విద్యార్థినులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

దుర్గమ్మకు విశేష పూజలు



పూజలందుకొంటున్న వై. జంక్షన్ దుర్గమ్మ

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడులోని వై. జంక్షన్ కనకదుర్గమ్మ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ఈవో యాళ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి ఆశ్వీజమాస ముగింపు శుక్రవారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేసారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. ప్రత్యేక అలంకరణలు చేసారు. ఆలయఉత్సవ కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తణుకు - నరసాపురం ఆర్టీసీ బస్సు రూటులో మార్పు

తణుకు అర్బన్: తణుకు నుంచి నరసాపురం వెళ్లే ఆర్టీసీ బస్సులు శనివారం నుంచి రూటు మార్పు జరుగుతుందని ప్రయాణికులు గమనించాలని ఆర్టీసీ డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్ తెలిపారు. కవిటం నుంచి మార్టేరు, పెనుగొండ నుంచి పెరవలి వరకు రహదారి మరమ్మతులు ప్రారంభిస్తున్న నేపథ్యంలో తణుకు నుంచి నరసాపురం వెళ్లే బస్సులు వయా గోపాలపురం, ఇరగవరం, కంతేరు, ఆలమూరు, కాపవరం, నెలమూరు బ్రిడ్జి, లంకలకోడేరు, పాలకొల్లు మీదుగా నరసాపురానికి నడుస్తాయని వివరించారు. ఈ రహదారులు మరమ్మతులు పూర్తయ్యేవరకు తణుకు నుంచి నరసాపురం బస్సులు నడపబడతాయని చెప్పారు.

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం



జిల్లా అధ్యక్షుడు ప్రసాదరాజు, మాజీ మంత్రులు కారుమూరి, కొట్టులను సత్కరిస్తున్న పీవీఎల్

కాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోని ప్రతి నాయకుడికీ, కార్యకర్తకూ అండగా ఉంటామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. మండలంలోని పెదఅమిరం పార్టీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జీలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్‌నర్సింహరాజు ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు ,కొట్టు సత్యనారాయణలను పుష్పగుచ్ఛాలు ఇచ్చి శాలువాలతో ఘనంగా సత్కరించారు. పార్టీ నాయకులు గూడూరి ఉమాబాల, ఉండి మండల పార్టీ కన్వీనర్ పీవీఆర్‌కే ఆంజనేయరాజు, వేగేశ్న జయరామకృష్ణంరాజు, గణేశ్న రాంబాబు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పశ్చిమ గోదావరి జిల్లాలో జరుగుతున్న రెవెన్యూ రీ భూసర్వే గ్రామసభలో రైతాంగం ఇస్తున్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించి రైతాంగంలో ఆందోళనలను నివారించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. పట్టణంలో శుక్రవారం జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు, చిర్ల పుల్లారెడ్డిలు మాట్లాడుతూ భూ సర్వేలు విషయంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో గందరగోళాన్ని సృష్టించిందని, నేడు రైతాంగం మరింత ఆందోళనలో ఉందన్నారు. పట్టాదారు పాస్‌బుక్స్‌లో లోపాలు ఉన్నాయని, రైతాంగం మానసిక ఆందోళనకు గురి అవుతుందని తెలిపారు. భూ రీ సర్వేలో రైతాంగం పెద్ద ఎత్తున దరఖాస్తులు అందిస్తున్నారని, రైతులు భూమి హక్కులు కాపాడాలని కోరారు.

28 నుంచి ఉపవాస పండుగలు

పెంటపాడు: ఈనెల 28 నుంచి బి. కొండేపాడు సీయోను మందిరంలో ఉపవాసపండుగలు నిర్వహించనున్నట్లు సంఘ కాపరి ఎం. సాల్మన్‌రాజు తెలిపారు. 3 రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాలలో తణుకు ఈపీఎఫ్ సంఘ అధ్యక్షుడు పి. మోజస్ ప్రవీణ్, నిజామ్‌బాద్‌కు చెందిన బ్రదర్ రమేష్‌జాన్, పాస్టర్ ఎం. జోసఫ్, సువార్త గాయకులు సాలోమోన్‌రాజు తదితరులు పాల్గొంటారన్నారు. పరిసర గ్రామాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని దైవ దీవెనలు పొందాలన్నారు.

మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



తణుకు మునిసిపల్ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న రాజగోపాల్

తణుకు అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా అపరిష్కృతంగా ఉన్న మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి ఐ.రాజగోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం తణుకు మునిసిపల్ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీఎఫ్ సౌకర్యం కల్పించాలని, పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలని, పట్టణ ప్రాంతాల్లో కొత్త పాఠశాలలను ఏర్పాటు చేయాలని, ఒకే ఆవరణలో రెండు పాఠశాలలను నిర్వహించడాన్ని నిలిపివేయాలని, పీఆర్సీ కమిటీని నియమించాలని, ఇంటీరియం రిలీఫ్‌ను ప్రకటించాలని, కరువు భత్య బకాయిలను విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు కె.రాంప్రసాద్, కె.అంజిబాబు, బి.సుబ్బారావు, ఎమ్.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

పెంటపాడు: గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండల పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఎంపీపీ దాసరి హైమావతి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామ స్థాయిలో చిన్నపాటి అభిప్రాయ బేధాల వల్ల అభివృద్ధిని ఆటంక పరచవద్దన్నారు. కూటమి ప్రభుత్వంలో తగినన్ని నిధులు లేకపోవడం వల్ల అభివృద్ధికి దాతల సహకారం తీసుకోవాలన్నారు. వచ్చే సమావేశంలో దాతలను సమైక్యపరచి అభివృద్ధిలో వారిని భాగస్వాములను చేద్దామన్నారు. గ్రామాలలో ప్రధాన సమస్యలైన తాగునీరు, డ్రెయినేజీ, రహదారులపై అధికారులతో పాటు, ప్రజాప్రతినిధులు ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలోమరో వంద పడకలు

తాడేపల్లిగూడెం: ఏరియా ఆస్పత్రిలో మరో వంద పడకల ఆస్పత్రిని వచ్చే మార్చి నాటికి అందుబాటులోకి తేనున్నామని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు వెల్లడించారు. శుక్రవారం ఆయన ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. నూతన భవన ప్రతిపాదిత ప్రాంతాన్ని వైద్యులు, కమిషనర్‌తో కలిసి పరిశీలించారు. ఆసుపత్రిలో నాబార్డు నిధులు సుమారు తొమ్మిదికోట్ల 50 లక్షల రూపాయలతో 2021లో పనులు చేపట్టగా, ఇప్పటి వరకు ఐదు కోట్ల 41 రూపాయల పైబడి పనులు పూర్తయ్యాయన్నారు. మిగిలిన పనులు జరగాల్సి ఉందన్నారు. ఈ పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయకపోతే లాప్స్ అయ్యే అవకాశం ఉందన్నారు. దీంతో ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చిందన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి పనులు పూర్తి చేయడానికి కాంట్రాక్టర్ ముందుకు వచ్చారన్నారు. రెండు నియోజకవర్గాలకు చెందిన రెండు లక్షల మందికి పైగా ఏరియా ఆస్పత్రి సేవలను అందిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో అదనపు బెడ్లతో నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. ఆయన వెంట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంటు పి.సూర్యనారాయణ, ఆర్ఎంఓ తాతారావు, మునిసిపల్ కమిషనర్ ఎం.ఏసుబాబులు ఉన్నారు.

అలంపురంలో నేడు, రేపు ఉచిత వైద్యశిబిరం

పెంటపాడు: మండలంలోని అలంపురం వెంకటరమణసేవాభారిటీ ఆసుపత్రిలో శని, ఆదివారాల్లో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు అధ్యక్షుడు కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణ లయన్స్ నేత్రవైద్యులు పరీక్షలు చేస్తారన్నారు. అవసరమైనవారికి ఆపరేషన్‌లతో పాటు, రాయితీపై కళ్లజోళ్లు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ శిబిరాలను పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మలుపులు.. ప్రమాదాలకు పిలుపులు



అత్తిలి మండలం కె సముద్రపుగట్టు వద్ద ప్రమాదకర మలుపు



అత్తిలి సంతమార్కెట్ సెంటర్‌లో మలుపువద్ద నిలిచిపోయిన లారీ(ఫైల్)



అత్తిలి మండలం కె సముద్రపుగట్టు ప్రాంతంలో రోడ్డుపై ఏర్పడ్డ గోతులు

అత్తిలి: ఆర్ అండ్ బీ రహదారులపై ఉన్న మలుపులు, గోతులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. స్టేట్‌హైవేను ఆనుకుని ఉన్న అత్తిలి నుంచి జిల్లా కేంద్రమైన భీమవరంకు వెళ్లే రహదారితో పాటు తణుకు, దువ్వ, అలంపురం వెళ్లే ఆర్అండ్‌బీ రహదారుల్లో ప్రమాదకర మలుపులు అనేకం ఉన్నాయి. మలుపుల వద్ద ఎదురెదురుగా వస్తున్న వాహనాలు గుర్తించే అవకాశం లేకపోవడంతో ప్రమాదాలు జరిగి క్షతగాత్రులైన సంఘటనలు ఇటీవల చోటు చేసుకున్నాయి. ప్రధానంగా తణుకు-భీమవరం ఆర్అండ్‌బీ మార్గంలో ప్రమాదకరమైన మలుపులు ఉన్నాయి. అత్తిలి మండల పరిధిలో అత్తిలి సంతమార్కెట్ సెంటర్, కె సముద్రపుగట్టు చర్చివద్ద, పాలూరు, ఈడూరు, కంచుమర్రు, స్కిన్నెరపురం గ్రామాల్లో మలుపులు ఉన్నాయి. ఈ ప్రాంతాలలో వాహనాలు ఒక్కసారిగా ఎదురెదురుగా వస్తున్న సందర్భంలో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి గాయపడిన సంఘటనలు జరిగాయి. పలు మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఉన్నప్పటికీ స్పీడ్ బ్రేకర్లు తెలిపే హెచ్చరిక బోర్డులుకానీ, మలుపులను తెలిపే బోర్డులు కానీ లేకపోవడంతో రాత్రి సమయాలలో పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. రద్దీగా ఉండే అత్తిలి సంతమార్కెట్ సెంటర్‌లో మలుపుల వద్ద ఒక్కోసారి ట్రాఫిక్ జాం అవుతోంది. పాలూరు కోళ్లఫాం వద్ద మలుపు వద్ద తరచు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వరస్వామివారి ఆలయం ఎదురుగా ఉన్న మలుపు ప్రమాదాలకు నిలయంగా మారింది. ఈఆలయానికి శనివారం పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. బస్సులు, ఆటోలు వంటి వాహనాలు ఎక్కేందుకు భక్తులు ఈమలుపు వద్దే రోడ్డుపైకి వేచి ఉంటారు.ఈమార్గంలో ప్రయాణించే వాహనాలు మలుపువద్దకు వేగంగా రావడంతో ఒక్కోసారి ప్రయాణికులపైకి దూసుకెళుతున్న సంఘటనలు చోటు చేసుకున్నాయి. అత్తిలి- అలంపురం మార్గంలో బల్లిపాడు సమీపంలో, ఉరదాళ్లపాలెం-దువ్వ మార్గంలో డి కుముదవల్లి, కోమర్రు, తిరుపతిపురం ప్రాంతాలలో ప్రమద కరమలుపులు ఉన్నాయి. మలుపులకు తోడు ఇటీవల కురిసిన వర్షాలకు ప్రధాన రహదారులపై పెద్ద గోతులు ఏర్పడటంతో ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి జారిపడి గాయాల పాలౌతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ఈప్రమాదాలు జరుగుతున్నాయి. స్పీడ్ బ్రేకర్లు, మలుపులు, రోడ్డుపై ఉన్న గోతులను తెలిపే విధంగా ఆర్అండ్‌బీ శాఖ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పశుగణనకు రైతులు సహకరించాలి



తణుకులో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

తణుకు: నాలుగు నెలల పాటు గ్రామాల్లో జరిగే పశుగణనకు రైతులు సహకరించాలని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ కోరారు. శుక్రవారం 21వ అఖిల భారత పశుగణనకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే రాధాకృష్ణ ఆవిష్కరించి మాట్లాడారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు జరిగే ఈ గణనలో పశువుల పెంపకందారులు, రైతులు ఇంటింటికీ వచ్చే ఎన్యుమరేటర్లకు వివరాలు ఇవ్వాలన్నారు. పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అత్తిలి ప్రాంతీయ పశువైద్యశాల వైద్యులు, అసిస్టెంట్ డైరెక్టర్ కె.నరసింహారావు, తణుకు మండలం అధికారి డాక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అయోడిన్ ఉప్పునే వాడాలి

వీరవాసరం: మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో భీమవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న వీరవాసరం మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో శుక్రవారం అయోడైజ్ సాల్ట్ వినియోగం పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పిబివిఎల్ సరోజిని అయోడైజ్డ్ సాల్టు వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. సాల్ట్ వాడటం వల్ల అయోడిన్ నష్టపోకుండా మనకు అందుతుందని తెలిపారు.